గ్రీవెన్స్‌కు 47 అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 19: ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 47అర్జీలు అందగా, అందులో 17రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, మిగతా 30అర్జీలు వివిధ శాఖలకు సంబంధించి ఉన్నాయి. ఆయా దరఖాస్తుల ను స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం

అమీన్‌పూర్, ఫిబ్రవరి 19 : మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన 2024-25 ఆర్థికసంవత్సరానికి సంబంధించి అమీన్‌పూర్ పురపాలిక వార్షిక బడ్జెట్ సమావేశాన్ని కమిషనర్ జ్యోతిరెడ్డి నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హాజయ్యారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ బడ్జెట్ మొత్తం 5578.30 లక్షలు కాగా అందులో పన్నుల రాబడి నుంచి 2800.00 లక్షలు, పన్నేతర రాబడి 2778.30 లక్షలుగా ప్రవేశపెట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సర మిగులు 60.71అంచనా వేశారు. వివిధ సేవల కోసం ఆదాయ,వ్యయాలను పొందుపర్చే విధంగా కౌన్సిల్ సమావేశం తీర్మానించినట్లు తెలిపారు. అమీన్‌పూర్ అభివృద్ధికి పాలక సభ్యులు సహకరించాలని చైర్మన్ పాండురంగారెడ్డి కోరారు.

సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నర్సింహగౌడ్, పాలక వర్గసభ్యులు బాసెట్టి కృష్ణ, రాజు, మహదేవరెడ్డి, మన్సిపల్ డీఈఈ వెంకటరమణ, ఏఈ ప్రవీణ్, ఆర్వో వెంకట రమయ్య, విద్యుత్తు ఏఈలు మణికంఠ, వెంక ట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

బాధ్యతలు స్వీకరించిన నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్లు

జహీరాబాద్, ఫిబ్రవరి 19: జాతీయ పారిశ్రామిక ఉత్పత్తి మండలి (నిమ్జ్) ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్లుగా నాగలక్ష్మి, వసంతకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్ పట్టణంలోని నిమ్జ్ ప్రాజెక్టు కార్యాలయంలో వారు బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన డిప్యూటీ కలెక్టర్లు రాధాబాయి, మహిపాల్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణలో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్లు నాగలక్ష్మి, వసంతకుమారి బదిలీపై నిమ్జ్‌కు వచ్చారు. నిమ్జ్ ప్రాజెక్టు -1కు నాగలక్ష్మి, ప్రాజెక్టు -2కు వసంతకుమారి బాధ్యతలు స్వీకరించారు.

డిప్యూటీ కలెక్టర్లు నాగలక్ష్మి, వసంతకుమారి

పీర్ సాహెబ్ ఉర్సులో భక్తుల సందడి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 19 : పీర్ సాహెబ్ ఉర్సులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సందడి చేశారు. ఉర్సుకు న్యాల్‌కల్ మండలంలోని గ్రామాలతోపాటు రాయికోడ్, ఝరాసంగం, మనూర్, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి దర్శించుకున్నారు. ఉర్సులో భాగంగా మంగళవారం అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు ఉంటాయని నిర్వాహక కమిటీ అధ్యక్షుడు యూనుస్‌ఖాన్ తెలిపారు. ఈ పోటీలకు మల్లయోధులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రజాప్రతినిధులు, నాయకులు, నిర్వాహక కమిటీ సభ్యులు వెండి కడియాలు బహూకరిస్తారని పేర్కొన్నారు.

పీర్ సాహెబ్ దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

అమీన్‌పూర్, ఫిబ్రవరి 19: అమీన్‌పూర్ చెరువు కట్టపై ఉన్న సాయిబాబా ఆలయ 8వ వార్షికోత్సవాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి వైస్‌చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సామాజిక సేవకు ఉత్తమ గుర్తింపు

గుమ్మడిదల, ఫిబ్రవరి 19: మండలకేంద్రానికి చెందిన కాకర్ల లలిత కొన్నేండ్లుగా సామాజిక సేవలు చేస్తూ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. చిన్న చిన్న కలహాలతో కుటుంబాల్లో తలెత్తే ఇబ్బందులకు పరిష్కారం చూపుతూ ఎన్నో కుటుంబాలు సంతోషంగా ఉండేలా చేశారు. దీంతో ప్రగతి, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వారు సావిత్రిపూలే 'స్పెషల్ ఎక్సలెన్స్' అవార్డును హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ అవార్డును అందజేశారు.

శారదకు పురస్కారం

బొల్లారం, ఫిబ్రవరి 19: వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందిస్తున్న వారికి వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు ప్రదానం చేశారు. బొల్లారం మున్సిపాలిటీకి చెందిన జెండర్ కమిటీ సభ్యులు, మాజీ వార్డు సభ్యురాలు శారద జ్యోతిరావు పూలే పురస్కారాన్ని అందుకున్నారు. నగరంలోనీ సుందరయ్య కళావిజ్ఞానకేంద్రంలో సరస్వతీ ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సినీనటుడు పృథ్వీరాజ్ అవార్డును శారదకు అందజేశారు.

గుమ్మడిదల : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నటుడు పృథ్వీరాజ్ నుంచి ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న లలిత

త్వరలో దొంగలను పట్టుకుంటాం

జహీరాబాద్, ఫిబ్రవరి 19: జహీరాబాద్ పట్టణంలో చోరీ చేసిన వారిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయంలో తనను కలసిన విలేకరులతో మాట్లాడారు. జహీరాబాద్ పట్టణంలో చోరీ చేసిన వారు కర్ణాటక, మహారాష్ట్రాల్లో కూడా నేరాలు చేశారన్నారు. నేరాస్తులపై మూడు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయని, వారి కోసం ప్రత్యేక పోలీసు టీంలు ఏర్పాటు చేశామన్నారు. దొంగతనాలను నివారించేందుకు రాత్రి ప్రత్యేక పెట్రోలింగ్ వాహనాలు ఏర్పాటు చేసి, గస్తీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. నేరాస్తులను పట్టుకునేందుకు షాపుల్లో వారి వేలిముద్రలు సేకరించామన్నారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, చోరీలను నివారించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు.

అమ్మాయిల చదువుతోనే సమాజంలో మార్పు

- విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని శ్రమించాలి
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- సంగుపేట పాలిటెక్నిక్ కళాశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం
- డాకూర్‌లో మంత్రిని ఘనంగా సన్మానించిన నాయకులు

అందోల్: పాలిటెక్నిక్ కళాశాలలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, ఫిబ్రవరి 19: అమ్మాయిల చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమని, ఇల్లాలు విద్యావంతురాలైతే ఆ కుటుంబ మంతా విద్యావంతులవుతారని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం సంగుపేట వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను మంత్రి సందర్శించి కాలేజీ ప్రహరీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మెడికల్, నర్సింగ్ కళాశాలతో పాటు 150 పడకల దవాఖాన నిర్మాణం కోసం వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కళాశాలలో వసతుల కల్పన కోసం నిధులు మంజూ రు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజల సౌలభ్యం కోసం నూతనంగా 150 పడకల దవాఖాన నిర్మిస్తున్నామని, మెడికల్, నర్సింగ్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని అందుకోసం నిరంతరం శ్రమించాలన్నారు. భవిష్యత్తులో అందోల్-జోగిపేటల్లో మరిన్ని విద్యాసంస్థలను నెలకొల్పి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత విద్య అందేలా కృషి చేస్తానన్నారు. అనంతరం డాకూర్ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పం చ్ పూజా, మాజీ ఎంపీటీసీ రమేశ్‌గౌడ్ తదితరులు మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఆర్డీవో పాండు తదితరులు పాల్గొన్నారు.

రూ.4.30 కోట్లతో శంకుస్థాపనలు

చౌటకూర్, ఫిబ్రవరి 19: విద్యార్జనతో సమాజంలో మార్పు సాధ్యమని, ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని వైద్యారోగ్య, శాస్త్రసాంకేతిక విద్యాశాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. చౌటకూర్ మండలంలోని శివంపేట పాలిటెక్నిక్ కళాశాల, సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రూ.4.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి శంకుస్థాపనలు చేశారు.

పుస్తక పఠనంతో రుగ్మతలు మాయం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, ఫిబ్రవరి 19: పుస్తక పఠనంతో రుగ్మతలు మాయమవుతాయని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నవ తెలంగాణ పబ్లికేషన్స్ పుస్తక ప్రదర్శనను ఎమ్మెల్యే సందర్శించి గోరక్‌పూర్ దవాఖాన ఘోరవిషాదం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ మానవుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాటానికి పుస్తక పఠనం ముఖ్యమని, రుగ్మతలు వస్తే మందులు వేసుకున్న విధంగా పుస్తకం పఠనం చేస్తే సగం రుగ్మతలు మాయమవుతాయన్నారు. ప్రతిఒక్కరూ పుస్తకాలు పఠించేందుకు కొంత సమయాన్ని కేటాయిస్తే రోగాలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు చక్రపాణి, జర్నలిస్ట్ పీవిరావు, గోవర్ధన్‌నాయక్, జీవీ శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, మజీద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్

సంగారెడ్డి, ఫిబ్రవరి19: సంగారెడ్డి గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ప్రసాద్‌చౌహాన్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కలిసి బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డీఈ ఇంతియాజ్ అహ్మద్, కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్(నాని), కో-ఆప్షన్ సభ్యుడు గోవర్ధన్ నాయక్, నాయకులు జీవి శ్రీనివాస్, దిడ్డి విఠల్ ఉన్నారు.

గోరక్‌పూర్ ఆసుపత్రి ఘోరవిషాదం అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్

గ్రాంస్ ఛార్స్ స్వాధీనం

జహీరాబాద్, ఫిబ్రవరి 19: గోవా నుంచి హైదరాబాద్‌కు కారులో అక్రమంగా తరలిస్తున్న 4.2గ్రాముల గ్రాంస్ ఛార్స్‌ను ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. మెదక్ డివిజన్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు జహీరాబాద్ మండలంలోని చెరాగ్‌పల్లిలో 65వ జాతీయ రహదారిపై ఉన్న ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయితో తయారు చేసిన గ్రాంస్ ఛార్స్ 4.2 గ్రాములు తరలిస్తూ పట్టుపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన అశ్రిత్ యాదవ్, ఆసిస్‌లను గుర్తించారు. జహీరాబాద్ ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా జగ్జీవన్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 19: నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్‌గా జగ్జీవన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జగ్జీవన్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన గోపు మల్లారెడ్డి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి బదిలీపై వెళ్లారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జగ్జీవన్‌ను స్థానిక మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సన్మానించి స్వాగతం పలికారు.

గరుడ వాహనంపై స్వామివారు

జిన్నారం, ఫిబ్రవరి 19: మండలంలో కొడకంచి ఆదినారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ఫౌండర్, ట్రస్టీ చైర్మన్ అల్లాణి రామాజీరావు ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆదినారాయణ స్వామి గరుడ వాహనంపై కొడకంచి పురవీధుల్లో ఊరేగారు. గ్రామస్తులు మంగళహారతులతో వచ్చి స్వామి వారిని పూజించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం, జాతర నిర్వహించనున్నారు.

విద్యార్థినులు వ్యాపార నైపుణ్యాభివృద్ధి సాధించాలి

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణబాయి
- ఈ నెల 21న కళాశాలలో విపణి కార్యక్రమం
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విద్యార్థులకు బహుమతులు

ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ నెల 21న విపణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణబాయి పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12ఏండ్లుగా కళాశాలలో విపణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వస్తువులతోపాటు, రుచికరమైన తెలంగాణ వంటకాలను ప్రదర్శించడంతోపాటు అమ్మకానికి ఉంచుతారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. విద్యార్థులకు రంగోలి, ముగ్గుల పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. గతేడాది 54 దుకాణాలను విద్యార్థులు ఏర్పాటు చేయగా, ఈ ఏడాది అంతే సంఖ్యలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. న్యాక్ నిబంధనల మేరకు విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలను అందించే క్రమంలో వ్యాపారరంగంలో రాణించేలా ఈ విపణి కార్యక్రమం తోడ్పడుతుందని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కేవలం ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూడకుండా వ్యాపార ఔత్సాహికులుగా రాణించాలని, దీంతో స్థిరపడడంతోపాటు పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతారాని వెల్లడించారు. ఈనెల 21న కలెక్టర్ చేతుల మీదుగా విపణి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పట్టణంలోని ఆయా కళాశాలల విద్యార్థులతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు సందర్శించి విజయవంతం చేయాలని ఆమె కోరారు. విలేకరుల సమావేశంలో అధ్యాపకులు హ్యుమేరా సయిద్, అశోక్, నవ్య, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 19 : నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 283మంది లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. జూకల్ శివారులోని కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేస్తామన్నారు.

ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదన్నారు. అనంతరం పట్టణంలోని శివా జీ చౌక్ వద్ద నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్‌లో ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నారాయణఖేడ్ మండలం నర్సాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు నారాయణఖేడ్ ఎంపీపీ సమావేశ మందిరంలో గ్రామాల ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్లు, బం జారా సేవాలాల్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

లింగమయ్య ఆశీస్సులతో మంచి జరగాలి

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 19: మానవ జన్మ శ్రేష్ఠమైనదని, లింగమయ్య ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఔదత్‌పూర్‌లోని ఎల్ల లింగేశ్వరాలయ జాతర ముగింపు ఉత్సవాల్లో పాల్గొని మచ్చిందర్‌నాథ్ మహారాజ్ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగమయ్య, మచ్చిందర్‌నాథ్ మహారాజ్ ఆశీస్సులతో భక్తులకు అన్ని విధాలుగా మంచి జరుగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పండరి యాదవ్, రాజ్‌కుమార్, జలిల్, అజయ్‌పాటిల్, సుభాశ్‌పాటిల్ ఉన్నారు.

అవిశ్వాసంపై డీసీవోకు వినతి

జిన్నారం, ఫిబ్రవరి 19: వావిలాల పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టాలని ఏడుగురు డైరెక్టర్లు సంగారెడ్డిలో డీసీవోకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన నాటి నుంచి సంఘం నడుపుటలో, ఎరువుల సరఫరాలో చైర్మన్ శేరికారి శంకర్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని డైరెక్టర్లు రాతపూర్వకంగా డీసీవోకు ఫిర్యా దు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ శేరికారి శంకర్‌రెడ్డిపై వెంటనే అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో డైరెక్టర్లు ఎంపీ మాణిక్‌రావు, పర్వతాలు, హరిశంకర్‌గౌడ్, సాయమ్మ, యాదయ్య, నర్సింహులు ఉన్నారు. వావిలాల పీఏసీఎస్ పరిధిలో మొత్తం 13మంది డైరెక్టర్లు ఉండగా ఏడుగురు అవిశ్వాసం కోసం వినతిపత్రం అందజేశారు.

దవాఖానలో శాశ్వత సిబ్బందిని నియమించాలి

డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రికి వినతిపత్రం అందజేస్తున్న శివశంకర్‌రావు

హత్నూర, ఫిబ్రవరి 19 : హత్నూర ప్రభుత్వ దవాఖానలో శాశ్వత సిబ్బందిని నియమించాలని కోరుతూ సోమవారం సునీతమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శివశంకర్‌రావు డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో శాశ్వత స్టాఫ్‌నర్స్ లేకపోవడంతో దవాఖానకొచ్చే రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

గతంలో దవాఖానలో ప్రసవాలతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేవని, కొన్నేండ్లుగా వాటిని నిలిపివేశారని తెలిపారు. దవాఖానలో శాశ్వత స్టాఫ్ నర్సును నియమించడంతోపాటు ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బడిలో చేరిన డ్రాపౌట్ విద్యార్థి

సిర్గాపూర్, ఫిబ్రవరి 19: మండలంలోని లొంకతండాలో బడిబయట ఉన్న విద్యార్థి నేనావత్ చరణ్‌తేజ్‌కు సీఆర్పీ శివకుమార్ స్వామి గుర్తించారు. ఈమేరకు సోమవారం విద్యార్థి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి సిర్గాపూర్ ఉన్నతపాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు.

వైన్స్ షాపుల తనిఖీ

జహీరాబాద్, ఫిబ్రవరి 19: జహీరాబాద్ పట్టణంలోని పలు వైన్స్ షాపులను ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్మకాలు చేయాలని సూచించారు. అధిక ధరలకు అమ్మకాలు చేసే షాపులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆర్డీవోగా రాజు బాధ్యతలు

జహీరాబాద్, ఫిబ్రవరి 19: జహీరాబాద్ ఆర్డీవోగా ఎస్.రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఆర్డీవో వెంకారెడ్డి శేరిలింగంపల్లికి బదిలీ అయ్యారు. హుజూరాబాద్ ఆర్డీవోగా పనిచేస్తున్న రాజు బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఆర్డీవో రాజును డివిజన్‌లోని తహసీల్దార్లు కలిసి సన్మానించారు.

నర్సరీలపై శ్రద్ధ చూపించాలి

కోహీర్, ఫిబ్రవరి 19: ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నర్సరీల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. సోమవారం కోహీర్ పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా సకాలంలో నీటిని అందించాలన్నారు. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులతో కలిసి పరిసరాలు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో సునంద రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 19: బదిలీపై వెళ్తున్న మండల అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. న్యాల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మానసభలో ఆయనకు మండల అధికారులు, సిబ్బంది శాలువాకప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ మండల అభివృద్ధి అధికారిగా వెంకట్‌రెడ్డి చేసిన సేలను కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

సిర్గాపూర్, ఫిబ్రవరి 19 : పదోతరగతి విద్యార్థుకు సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన డాక్టర్ లక్ష్మీనారాయణ ప్యాడ్స్ అందజేయగా, విశ్రాంత ఉపాధ్యాయులు విఠల్, శంకర్‌గొండ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్ స్వామి, టీచర్లు రహీం, మహేశ్వర్‌రావు, సీఆర్పీ శివకుమార్‌స్వామి ఉన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

బొల్లారం, ఫిబ్రవరి 19: చెత్త సేకరణకు కేటాయించిన డబ్బాల్లో కాకుండా రోడ్లపై విచ్చలవిడిగా చెత్తాచెదారాన్ని వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. అర్ధరాత్రి సమయాల్లో రోడ్డుపై చెత్త వేస్తున్నారన్న విషయం తెలుసుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమిషనర్ ఆదేశాల మేరకు చెత్త వేసిన వారితోనే చెత్తను తొలిగించే చర్యలు తీసుకున్నారు. చెత్త సేకరణకు వచ్చే మున్సిపల్ వాహనాల్లోనే చెత్తను వేయాలని, అలాకాకుండా బహిరంగప్రదేశాలు, ఖాళీ స్థలాలు, రోడ్లపై ఇష్టారీతిన చెత్తా వేస్తే కఠిన చర్యలు తప్పవని స్థానికులను హెచ్చరించారు.

ఎంపీడీవోకు వినతి

హత్నూర, ఫిబ్రవరి 19 : కబ్జాకు గురవుతున్న గ్రామకంఠం భూమిని కాపాడాలని కోరుతూ హత్నూర ఎంపీడీవో శంకర్‌కు సాదుల్లానగర్ గ్